



EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
సోమవారం
10 మార్చి 2025
పేజీలు: 02



# గిరిజన ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదవ తరగతి బాలిక అనుమానాస్పద మృతి

### గత 15 నెలల్లో గురుకులాల్లో 83 విద్యార్థులు మృతి

విద్యాశాఖ మంత్రి లేక రాష్ట్రంలో అదుపుతప్పుతున్న విద్యావ్యవస్థ. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో నేల రాలుతున్న పసి ప్రాణాలు, గత 15 నెలల్లో గురుకులాల్లో 83 విద్యార్థులు మృతి, అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న బాలిక అనుమానస్పదంగా మృతి చెందింది. కూతురు మృతి పట్ల అనుమానాలు ఉన్నాయని ఆందోళన చేస్తున్న తల్లితండ్రులను, బాలిక మృతదేహాన్ని బోథ్ ఆసుపత్రికి తరలించిన పోలీసులు.ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో విషాదం చోటుచేసుకుంది. తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక రాత్రి పడుకున్న స్థలంలోనే మృతి చెందింది. బాలిక నోటినుంచి నురగ రావడంతో మృతురాలి తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతి కారణాలు తెలియాల్సి ఉంది.

# చెన్నైలో 'జైలర్ 2' షూట్ స్టార్ట్

సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన మాస్ యాక్షన్ ఎమోషనల్ ఎంటర్టైనర్ 'జైలర్' అద్భుత విజయాన్ని సాధించింది. ఇదిలా ఉంటే ఈ క్రైమ్ థ్రిల్లర్‌కు కొనసాగింపుగా 'జైలర్ 2' రాబోతున్న సంగతి తెలిసిందే. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ షూటింగ్ నేడు చెన్నైలో ప్రారంభం కాబోతుంది. ఈ షెడ్యూల్ రెండు వారాల పాటు కొనసాగనుంది. ఈ షెడ్యూల్ తర్వాత ఏప్రిల్ లో రెండో షెడ్యూల్ మొదలుకాబోతుంది. కాగా 'జైలర్ 2'లో కూడా తమన్నా, యోగిబాబు, వినాయకన్, రమ్యకృష్ణ తదితరులు కీలక పాత్రల్లో నటించబోతున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్ పై కళానిధి మారన్ ఈ జైలర్ 2 ను కూడా గ్రాండ్ గా నిర్మించబోతున్నారు. 'టైగర్ కా హుకూమ్' అంటూ 'జైలర్'లో హంగామా చేసిన రజనీకాంత్, 'జైలర్ 2'లో ఎలాంటి హంగామా చేస్తారో చూడాలి. ఇక ప్రస్తుతం రజనీకాంత్ 'కూలీ' సినిమాతో కూడా బిజీగా ఉన్నారు.



# ఫుడ్‌పాయిజన్‌తో 70 మందికి అస్వస్థత

పెద్దఅంబర్‌పేట పరిధిలోని ఓ ఐఐటీ క్యాంపస్‌లో 70 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఎప్పటిలాగే ఆదివారం ఉదయం వారు అల్పాహారంలో చపాతీ, ఆలుకుర్మా తీసుకున్నారు. రెండు గంటల తర్వాత 70 మం దికిపైగా విద్యార్థినులు వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పితో ఇబ్బందిపడ్డారు. దీంతో వైద్యులను క్యాంపస్‌కు రప్పించి చికిత్స అందించారు. తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థినులను హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఎలాంటి ఫుడ్ పాయిజన్ జరగలేదని క్యాంపస్ ప్రతినిధులు చెబుతున్నారు. పిల్లలకు ఫుడ్ పాయిజన్ జరిగినా తమను కాలేజీ లోపలికి అనుమతించడం లేదని పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేశారు. హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్ క్యాంపస్‌కు చేరుకుని విద్యార్థినులను విచారించారు. తుర్కయాంజాల్ పరిధిలోని క్యాంపస్‌లోనూ శనివారం రాత్రి పలువురు విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కాగా.. వారిని దవాఖానకు తరలించినట్టు తెలుస్తున్నది.




# రేపు బీఆర్ఎస్ఎల్పీ సమావేశం



రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై బీఆర్ఎస్ సన్నద్ధమవుతున్నది. ఈ మేరకు పార్టీ అధినేత కేసీఆర్ ఉభయ సభల సభ్యులకు దిశానిర్దేశం చేయనున్నారు. తెలంగాణభవన్‌లో మంగళవారం ఒంటిగంటకు బీఆర్ఎస్ఎల్పీ సమావేశం నిర్వహించనున్నారు. ఈ నెల 12 నుంచి ప్రారంభంకానున్న బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావించాల్సిన అంశాలు, అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ సూచనలు చేయనున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం సమావేశాలు ప్రారంభమవుతాయి.



# కుడుంబాస్థాన్ రివ్యూ

రీసెంట్ గా నేరుగా ఓటిటిలో రిలీజ్ కి వచ్చిన చిత్రాల్లో తమిళ చిత్రం "కుడుంబాస్థాన్" కూడా ఒకటి. స్ట్రీమింగ్ ప్లాట్ ఫామ్ జీ5 లో రిలీజ్ కి వచ్చిన ఈ చిత్రం ఎలా ఉందో రివ్యూలో చూద్దాం రండి. ఇక కథ లోకి వస్తే.. నవీన్(మణికందన్) ఒక చిన్నపాటి మిడిల్ క్లాస్ యువకుడు తాను ప్రేమించిన అమ్మాయి నీలా(సాన్వి మేఘన) ని రిజిస్టర్ మ్యారేజ్ చేసుకొని ఒక హ్యాపీ లైఫ్ లీడ్ చేస్తాడు. కానీ ఒక్కసారిగా తన లైఫ్ తలకిందులు అయ్యిపోతుంది. ఆర్థిక ఇబ్బందులతో అప్పులు పాలు అయ్యిపోతాడు. అయితే తన జీవితం సడెన్ గా ఎందుకు ఇలా అయ్యిపోయింది? తాను చేసిన అప్పుడు తీర్చగలుగుతాడా? తనని ఇలా ఇబ్బంది పడేలా చేసింది ఎవరు? ఈ సమస్యలు అన్నిటి నుంచి తాను బయటకి వచ్చాడా లేదా అనేది తెలియాలి అంటే ఈ చిత్రాన్ని చూసి తెలుసుకోవాలి. జై భీమ్ నటుడు మణికందన్ మంచి టాలెంట్ కలిగిన నటుడు చాలా ఈజ్ తో నాచురల్ నటనతో ఇంప్రెస్ చేస్తాడు. ఇంట్రెస్టింగ్ ఈ సినిమాలో కూడా తనదైన పెర్ఫామెన్స్ ని అందించాడు అని చెప్పవచ్చు. తన పాత్ర చాలా మందికి కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. అందులోని బ్యూటిఫుల్ ఎమోషన్స్ ని తాను బాగా పండించాడు. ఇక నటుడు గురు సోమసుందరం తన పాత్రలో షైన్ అయ్యారు అని చెప్పవచ్చు. సినిమాలో పలు సన్నివేశాలని తన హ్యూమర్ తో ఎంజాయ్ చేసే విధంగా మార్చారు. మెయిన్ గా తనపై ఇంటర్వెల్ సీక్వెన్స్ తనపై భలే అనిపిస్తుంది. ఇక నటి సాన్వి మేఘన డీసెంట్ రోల్ లో మంచి నటన కనబరిచింది. ఇక వీరితో పాటుగా మిగతా నటీనటులు తమ పాత్రల పరిధి మేరకు బాగా చేశారు. ఈ సినిమాలో అక్కడక్కడా మంచి కామెడీ కనిపిస్తుంది కానీ ఈ మూమెంటం పూర్తి స్థాయిలో కొనసాగితే బాగుండు అనిపిస్తుంది. కొంతమేర సినిమా స్లోగా సాగుతున్నట్టుగా అనిపిస్తుంది. దీంతో అక్కడక్కడా ఆడియెన్ పక్కదారి పట్టవచ్చు. అలాగే సినిమాలో ఎమోషనల్ పార్ట్ కూడా ఇంకా బెటర్ గా చేయాల్సి ఉంది. ఉన్న ఎమోషనల్ డెప్త్ సరిపోనట్టు అనిపిస్తుంది. అలాగే హీరోయిన్ రోల్ కూడా లిమిటెడ్ గానే అనిపిస్తుంది. తన పాత్ర ఇంకా బెటర్ గా షేప్ అవుట్ చేసేందుకు ఆస్కారం ఉంది కానీ ఎందుకో మిస్ చేసినట్టు అనిపించక మానదు. అలాగే సినిమా తెలుగు డబ్బింగ్ ఇంకా బెటర్ గా చేసి ఉంటే అది సినిమాని ఇంకా నాచురల్ గా మార్చి ఉండవచ్చు. తెలుగు డబ్బింగ్ ఈ సినిమాలో అన్ని పాత్రలకి అంత నాచురల్ గా క్లిక్ కాలేదు. ఈ చిత్రంలో నిర్మాణ విలువలు బాగున్నాయి. అయితే తెలుగు డబ్బింగ్ మాత్రం ఇంకా జాగ్రత్తలు తీసుకోవాల్సింది. సంగీతం బానే ఉంది. సినిమాటోగ్రఫీ డీసెంట్ అని చెప్పవచ్చు. ఎడిటింగ్ ఇంకా బెటర్ గా చేయాల్సింది. ఇక దర్శకుడు రాజేశ్వర్ కాళిస్వామి విషయానికి వస్తే.. తనకి ఇది మొదటి సినిమానే అయినప్పటికీ తన దర్శకత్వ మెళుకువలు బాగున్నాయని చెప్పవచ్చు. కొన్ని చోట్ల కథనం స్లోగా నడిపించారు కానీ ఎంటర్టైనింగ్ గా ఈ కథని ప్లాన్ చేసుకున్న విధానం బాగుంది. అలాగే పలు ఎమోషన్స్ ని కూడా బాగానే రాసుకున్నారు. అయితే వీటిని సహా మరికొన్ని అంశాలు మరింత బెటర్ గా చూపించి ఉంటే అవుట్ పుట్ మరింత అందంగా వచ్చి ఉండేది. ఇక మొత్తంగా చూసుకున్నట్టయితే.. ఈ "కుడుంబాస్థాన్" ఒక డీసెంట్ కామెడీ ఎంటర్టైనర్ అని చెప్పవచ్చు. మెయిన్ గా మణికందన్ సహా నటుడు గురు సినిమాలో అలరిస్తారు. అలాగే కొన్ని ఎమోషన్స్ కూడా బాగున్నాయి.

# లలిత్ మోదీకి షాక్




ఐపీఎల్ వ్యవస్థాపకుడు, మాజీ చైర్మన్ లలిత్ మోదీకి షాక్ తగిలింది. ఇటీవలే ఆయన పసిఫిక్ ద్వీప దేశమైన వనౌటు పౌరసత్వం తీసుకున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే, లలిత్ మోదీకి జారీ చేసిన పౌరసత్వాన్ని రద్దు చేయాలని ఆ దేశం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే లలిత్ మోదీ పాస్‌పోర్ట్‌ను రద్దు చేయాలని పౌరసత్వ కమిషన్‌ను వనౌటు ప్రధాని జోథం నపాట్ ఆదేశించారు. 'లలిత్ మోదీ వనౌటు పాస్‌పోర్ట్‌ను రద్దు చేయడానికి వెంటనే చర్యలు ప్రారంభించాలని పౌరసత్వ కమిషన్‌ను నేను ఆదేశించాను' అని ప్రధాని నపట్ ఓ అధికారిక ప్రకటనలో తెలిపారు. భారత్‌కు అప్పగింత నుంచి తప్పించుకోవడానికి తమ దేశ పౌరసత్వాన్ని లలిత్ మోదీ ఉపయోగించుకుంటున్నట్టు నపట్ ఆరోపించారు. లలిత్ మోదీ సిటిజన్‌షిప్‌ను రద్దుకు సంబంధించిన సమాచారాన్ని వనౌటు దినపత్రిక వనౌటు డైలీ వెల్లడించింది. భారత్ ఒత్తిడి వల్లే లలిత్ మోదీ పౌరసత్వాన్ని ఆ దేశం రద్దు చేసినట్లు సమాచారం. లలిత్ మోదీ పాస్‌పోర్ట్ రద్దు చేయడంలో న్యూజిలాండ్‌లోని భారత హైకమిషనర్ నీతా భూషణ్ కీలక పాత్ర పోషించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.



# 'జాట్' నుంచి రణ్‌దీప్ హుడా ఫస్ట్ లుక్ రిలీజ్

టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని, బాలీవుడ్ సూపర్ స్టార్ సన్నీ డియోల్ కాంబోలో రాబోతున్న లేటెస్ట్ మూవీ 'జాట్'. పవర్ ఫుల్ యాక్షన్ ప్యాక్‌డ్ మూవీగా తెరకెక్కుతున్న ఈ సినిమాను తెలుగు అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. అయితే పలు హిట్ మూవీస్ తెరకెక్కించిన దర్శకుడు రూపొందిస్తుండటంతో అంచనాలు భారీగా పెరిగిపోయాయి. ఈ చిత్రానికి ఎస్ తమన్ బ్యాగ్రౌండ్ స్కోర్ అందిస్తుండగా.. ఇందులో వినీత్ కుమార్ సింగ్, సయామి ఖేర్, రెజీనా కసాండ్రా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. షూటింగ్ శరవేగంగా జరుగుతున్న ఈ మూవీ ఏప్రిల్ 10న గ్రాండ్‌గా థియేటర్స్‌లో విడుదల కానుంది. ఇక ఇప్పటికే 'జాట్' నుంచి విడుదలైన పోస్టర్స్, టీజర్ అందరిలో క్యూరియాసిటీని పెంచాయి. తాజాగా, ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు రణ్‌దీప్ హుడా ఇందులో పవర్ ఫుల్ క్యారెక్టర్‌లో నటిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు.



# ట్రాఫిక్ కు అంతరాయం కల్పించిన 9 మందిపై కేసు

ఏన్కూరు ప్రధాన రహదారిపై యువకుడి మృతదేహంతో రాస్తారోకో చేసి ట్రాఫిక్ కు అంతరాయం కల్పించిన 9 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ రఫీ తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన టీఎల్ పేటకు చెందిన యువకుడు పసుపులేటి కృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రామస్తులు ఏన్కూరు ప్రధాన రహదారిపై సుమారు గంటకు పైగా రాస్తారోకో చేశారు. అందుకు ప్రధాన కారకులుగా గుర్తించి 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.



# ధర్నా చౌక్ వద్దకు భారీగా చేరుకున్న పోలీసులు

రాష్ట్రంలోని అంగన్వాడీ కార్యకర్తలు ఛలో విజయవాడ పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం గాంధీనగర్ ధర్నా చౌక్ వద్దకు పోలీసులు భారీగా చేరుకున్నారు. అంగన్వాడీ కార్యకర్తలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10వేల మంది అంగన్వాడీలు రానున్న నేపథ్యంలో సీఐ లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగానే పోలీసులు భారీగా చేరుకున్నారు.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM


# ఏలూరులో ఘోర ప్రమాదం.. స్పాట్‌లోనే 30 మంది!

ఏలూరులో ఘోర రోడ్డు ప్రమాద ఘటన చోటుచేసుకుంది. ఓ ఆశ్రమం హాస్పిటల్ సమీపంలో ప్రైవేట్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 30 ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. విశాఖపట్నం నుంచి గుంటూరు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు వెంటనే ఘటనా స్థలం చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా ఇటీవల మహారాష్ట్రలో నలుగురు కార్మికులు మృతి చెందారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో వాటర్ ట్యాంక్ క్లీన్ చేస్తుండగా ఊపిరాడక నలుగురు కార్మికులు మృతి చెందారు. మరో వ్యక్తి అస్వస్థతకు గురయ్యాడు. అతడ్ని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నాగ్‌పాడలోని నిర్మాణంలో ఉన్న ఓ బిల్డింగ్‌పై ఉన్న వాటర్ ట్యాంక్‌ను ఐదుగురు కూలీలు శుభ్రం చేయడానికి లోపలికి దిగారు. దీంతో ఊపిరాడక వారు అస్వస్థతకు గురయ్యారు. ఆ వాటర్ ట్యాంకులోనే ఉండిపోయారు. ఈ విషయం తెలుసుకున్న ముంబై అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, అంబులెన్స్‌లు, బీఎంసీ వార్డు అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఊపిరాడక అచేతనంగా పడిపోయిన ఐదుగురిని వాటర్ ట్యాంకు నుంచి బయటకు తీశారు. అంబులెన్స్‌ల్లో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నలుగురు కూలీలు మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఒక వ్యక్తికి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అర్హులైన ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తాం: మంత్రి అచ్చెన్న



అర్హులైన ప్రతి రైతుకు 'అన్నదాత సుఖీభవ' కింద రూ.20 వేలు ఇస్తామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం అసెంబ్లీలో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. కేంద్రం ఇచ్చే డబ్బులతో కలిపి బ్యాంకుల్లో నగదు జమ చేస్తామని వెల్లడించారు. కౌలు రైతులు, వెబ్ ల్యాండ్‌లో నమోదైన వారికీ ఈ పథకం వర్తిస్తుందన్నారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. రూ.30 వేల కోట్ల పెట్టుబడుల లక్ష్యంతో ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ తెచ్చామన్నారు.



# టీమ్‌ఇండియా విజయోత్సవ ర్యాలీపై రాళ్లదాడి

భారత క్రికెట్ జట్టు 12 ఏండ్ల తర్వాత చాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకున్నది. దుబాయ్ వేదికగా జరిగిన ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను మట్టికరిపించి ముచ్చటగా మూడోసారి 'చాంపియన్స్'గా నిలిచింది. దీంతో దేశవ్యాప్తంగా సంబురాలు అంబరాన్నంటాయి. పటాకుల మోతలు, విజయోత్సవ ర్యాలీలతో ప్రజలు సంతోషాన్ని పంచుకున్నారు. ఈ క్రమంలో పలుచోట్ల అవాంఛనీయ ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లా మోవ్ పట్టణంలో కొందరు యువకులు టీమ్‌ఇండియా విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని జామా మసీద్ వద్దకు ర్యాలీ చేరుకున్నది. అయితే కొందరు వ్యక్తులు ర్యాలీపై రాళ్లతో దాడిచేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. పరస్పరం రాళ్లతో దాడిచేసుకున్నారు. పలు దుకాణాలను ధ్వంసం చేశారు. వాహనాలకు నిప్పంటించారు. దీంతో ఆ ప్రాంతంలో పోలీసులు భారీగా మోహరించారు. ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉన్నదని ఇండో జిల్లా కలెక్టర్ వెల్లడించారు.

# రిటైర్మెంట్ వార్తలకు చెక్‌పెట్టిన రోహిత్ శర్మ

తన రిటైర్మెంట్‌పై వస్తున్న వార్తలను టీమిండియా సారథి రోహిత్ శర్మ క్లారిటీ ఇచ్చాడు. న్యూజిలాండ్‌ను నాలుగు వికెట్ల తేడాతో ఓడించి మూడోసారి ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో 76 పరుగులతో అజేయంగా నిలిచి.. మ్యాచ్‌లో కీలకపాత్ర పోషించిన రోహిత్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ.. తన రిటైర్మెంట్ గురించి ఊహాగానాలకు తెర దించాడు. తాను వన్డే ఫార్మాట్ నుంచి ఇప్పుడే రిటైర్ కాబోవడం లేదని తెలిపాడు. దయచేసి ఎవరూ పుకార్లు వ్యాప్తి చేయొద్దని కోరాడు. ఈ ప్రశ్న విని తాను ఆశ్చర్యం వేసిందని చెప్పాడు. భవిష్యత్ ప్రణాళిక ఏమీ లేదని.. ఏం జరగాలని ఉందో అదే జరుగుతుందని పేర్కొన్నాడు. చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం నుంచే తొలి బంతి నుంచే దూకుడుగా ఆడుతున్న రోహిత్ శర్మ.. కీలకమైన ఫైనల్ మ్యాచ్‌లో రాణించాడు. అంతకు ముందు ఆస్ట్రేలియా పర్యటనలో ఏమాత్రం ఆకట్టుకోలేకపోయాడు. ఫామ్ లేమితో ఇబ్బందిపడుతున్న రోహిత్ శర్మపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఇక క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాల్సిన టైమ్ వచ్చిందని పలువురు విశ్లేషకులు వ్యాఖ్యానించారు. ఫైనల్ మ్యాచ్‌కు ముందు సైతం రోహిత్ శర్మ చాంపియన్స్ ట్రోఫీ తర్వాత రిటైర్ అయ్యే అవకాశం ఉందని ఊహాగానాలు వచ్చాయి. తాజాగా వాటన్నింటికి రోహిత్ ఫుల్‌స్టాప్ పెట్టాడు.






# హిస్టారికల్ డ్రామాతో రాబోతున్న గోపీచంద్!

యాక్షన్ హీరో గోపీచంద్, ఘాజీ ఫేమ్ దర్శకుడు సంకల్ప్ రెడ్డితో కలిసి ఒక ఉత్తేజకరమైన సరికొత్త ప్రాజెక్ట్ ను స్టార్ట్ చేశారు. ఈ చిత్రం గోపీచంద్ సినీ కెరీర్ లో 33వ సినిమాగా రాబోతుంది. కాగా ఈ రోజు హైదరాబాద్‌లో అధికారికంగా పూజా కార్యక్రమంతో నటీనటులు మరియు చిత్ర సిబ్బంది మధ్య ఈ సినిమా లాంచ్ అయింది. అన్నట్టు ఈ ప్రతిష్టాత్మక హిస్టారికల్ డ్రామా 7వ శతాబ్దంలో సాగనుంది. కాగా త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభించబడుతుందని మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి పవన్ కుమార్ కూడా సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. కాగా ఈ సినిమా టైటిల్ మరియు ఈ సినిమాలో నటించే మిగిలిన తారాగణంతో సహా ఈ ప్రాజెక్ట్ గురించి పూర్తి వివరాలు రాబోయే రోజుల్లో వెల్లడించనున్నారు.

# పాలన చేతగాక ప్రకృతి మీద కూడా నిందలా?

## హరీశ్‌రావు



ఎండల వల్ల పంటలు ఎండుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు భగ్గుమన్నారు. పాలన చేతగాక ప్రకృతి మీద కూడా రేవంత్‌రెడ్డి నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. 'ఎండలకు పంటలు ఎండుతున్నయట! కేసీఆర్ ఉన్నప్పుడు ఎండలు లేవా? ఎండలు ముందు పుట్టినయా? రేవంత్ ముందు పుట్టిండా?' అని ఎద్దేవాచేశారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, రేవంత్ తెచ్చిన కరువని మండిపడ్డారు. 'ఒకవైపు ఏపీ మొత్తం నీళ్లు తీస్కపోయింది. దేవాదులలో కావల్సినన్ని నీళ్లున్నయి. మోటర్లు ఆన్ చేయలేదు. వరంగల్ జిల్లాల్లో లక్ష ఎకరాల్లో పంట ఎండిపోతున్నది. రూ.7 కోట్ల బిల్లులు ఇవ్వలేదని దేవాదుల వద్ద కార్మికులు సమ్మె చేసిండ్రు. 32 రోజులు మోటర్లు ఆన్ చేయలేదు. నీళ్లన్నీ కిందికి పోయినయి. కేసీఆర్ హయాంలో నీళ్లు రాంగనే మోటర్లు వేసేవారు. కాంగ్రెస్ సర్కారు కమీషన్లు కుదరక రూ.7 కోట్ల బిల్లు ఇవ్వలేదు. కేసీఆర్ హయాంలో ఎండాకాలంలో చెరువులు మత్తళ్లు దుంకేవి. కాల్వలు నీళ్లతో కళకళలాడేవి. ఇది ప్రకృతి వైపరీత్యం కాదు, రేవంత్ వైఫల్యం. బేలగా మాట్లాడి తప్పించుకోలేరు' అంటూ నిప్పులు చెరిగారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ఎకరాకు రూ.10 వేల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. తెలంగాణభవన్‌లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, కరీంనగర్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యురాలు సుమిత్ర ఆనంద్‌తో కలిసి హరీశ్ మీడియాతో మాట్లాడారు.

# మరోసారి ప్రయోగాత్మక లుక్‌తో అల్లు అర్జున్!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా ఇపుడు చేసిన భారీ చిత్రం పుష్ప 2 ది రూల్ తో పాన్ ఇండియా లెవెల్లో ఎలా షేక్ చేసాడో అందరికీ తెలిసిందే. అయితే అల్లు అర్జున్ ఫిల్మోగ్రఫీ చూసుకున్నట్టయితే తన నుంచి అనేక సినిమాలకి ఎంతో కొత్తదనం కనిపిస్తూనే ఉంటుంది. మెయిన్ గా లుక్ పరంగా బన్నీ చాలా ప్రయోగాలు చేసాడు. ఇలా పుష్ప 2 కి కూడా ఒక డీ గ్లామర్ లుక్ లో ఫిజికల్ గా కూడా ట్రాన్స్ఫర్మ్ అయ్యి మంచి ట్రీట్ అందించాడు. ఇలా నటన పరంగా మన స్టార్స్ లో బన్నీ ఎంతవరకు అయినా వెళ్తాడు. అయితే ఇపుడు తన నెక్స్ట్ సినిమా కోసం మళ్ళీ ఒక ప్రయోగాత్మక లుక్ ని బన్నీ సిద్ధం చేస్తున్నట్టుగా మైత్రి నిర్మాత రవి శంకర్ రివీల్ చేశారు. బన్నీ నెక్స్ట్ సినిమాలో లుక్ ఊహించని లెవెల్లో ఉంటుంది అని ఇపుడు బన్నీ ఆ లుక్ ప్రిపేర్ చేసే పనుల్లో ఉన్నారు అంటూ క్రేజీ అప్డేట్ అందించారు. ఆ లుక్ లో బన్నీ అందరికీ షాకిస్తాడు అంటూ చేసిన కామెంట్స్ ఇపుడు బన్నీ ఫ్యాన్స్ ని మరింత ఎగ్జైట్ చేస్తున్నాయి.



# 16 రోజుల తర్వాత..ఒక మృతదేహం దొరికింది

## 16 రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యలు



ఎస్ఎల్‌బీసీ ఘటనలో ఎట్టకేలకు పురోగతి సాధించారు. రెస్క్యూ టీమ్ 16 రోజులుగా చేపట్టిన సహాయక చర్యల ఫలితం లభించింది. టన్నెల్‌లో చిక్కుకున్న వారిలో ఒక మృతదేహాన్ని రెస్క్యూ టీమ్ గుర్తించారు. టీబీఎం ముందు భాగంలో మృతదేహంను వెలికితీశారు. ఆ మృతదేహాన్ని బయటకు తీసేందుకు సహాయక బృందాలకు డ్రిల్లింగ్ తప్పలేదు. ఇన్నాళ్లకు ఒక మృతదేహాన్ని గుర్తించడంతో అధికారులు కాస్త ఊపిరిపీల్చుకున్నారు. మృతుడి చేతికున్న కడియం ఆధారంగా అతడు రాబిన్స్ కంపెనీకి చెందిన ఇంజనీర్ గురుప్రీత్ సింగ్ అని అధికారులు గుర్తించారు. కాగా టీబీటీ మిషన్ సమీపంలో మట్టిలో ఇరుకపోయినట్లు కేరళకు చెందిన క్యాడ్వర్ డాగ్స్ గుర్తించాయని వివరణ ఇచ్చారు. డెడ్ బాడీని పోస్టుమార్టం నిమిత్తం నాగర్ కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మరో ఏడుగురు ఈ ప్రమాదంలో చిక్కున్నారు. వారి ఆచూకీ కోసం 11 రెస్క్యూ బృందాల ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మరోవైపు టీబీఎం ముందు భాగంలో దుర్వాసన వస్తోందని రెస్క్యూ టీమ్ చెబుతున్నారు. దీనితో కార్మికులు అందరు ఒకే చోట ఉండొచ్చని అనుమానంగా ఉందన్నారు.

# ఐఫాలో లాపతా లేడీస్ సంచలనం.. ఏకంగా పది అవార్డులు కైవసం

భారతీయ సినీ పరిశ్రమలో ప్రతిష్టాత్మకంగా భావించే 'ఐఫా' అవార్డ్స్ వేడుక రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఘనంగా ముగిసింది. జైపూర్ ఎగ్జిబిషన్ & కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 8వ తేదీన అట్టహాసంగా ప్రారంభమైన ఈ వేడుక.. ఆదివారంతో ముగిసింది. మొదట డిజిటల్ అవార్డులను ప్రకటించిన నిర్వాహకులు.. ఆదివారం రాత్రి చలనచిత్ర అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో కిరణ్ రావు దర్శకత్వంలో వచ్చిన 'లాపతా లేడీస్' సంచలనం సృష్టించింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ నటి, ఉత్తమ కథ ఇలా ఏకంగా పది కేటగిరీల్లో అవార్డులు గెలుసుకుని సత్తా చాటింది. 'భూల్ భూలయ్యా 3'కు ఉత్తమ నటుడిగా కార్తిక్ ఆర్యన్ అవార్డు సొంతం చేసకున్నారు.

'ఐఫా' చలనచిత్ర అవార్డ్స్ విజేతలు

ఉత్తమ చిత్రం: లాపతా లేడీస్
ఉత్తమ నటుడు — కార్తీక్ ఆర్యన్ (భూల్ భూలయ్యా 3)
ఉత్తమ నటి — నితాన్షి గోయెల్ (లాపతా లేడీస్)
ఉత్తమ దర్శకురాలు — కిరణ్ రావు (లాపతా లేడీస్)
ఉత్తమ విలన్ — రాఘవ్ జుయల్ (కిల్)
ఉత్తమ సహాయ నటి — జాంకీ బోడివాలా (షైతాన్)
ఉత్తమ సహాయ నటుడు — రవి కిషన్ (లాపతా లేడీస్)



ఉత్తమ దర్శకుడు (తొలి పరిచయం) — కునాల్ కేము (మడ్గావ్ ఎక్స్‌ప్రెస్)
ఉత్తమ నటి (తొలి పరిచయం) — ప్రతిభా రంతా (లాపతా లేడీస్)
ఉత్తమ నటుడు (తొలిపరిచయం) — లక్ష్య (కిల్)
ఉత్తమ నేపథ్య గాయని — శ్రేయా ఘోషల్
ఉత్తమ నేపథ్య గాయకుడు — జుబిన్ నౌటియల్
ఉత్తమ సంగీత దర్శకుడు — రామ్ సంపత్ (లాపతా లేడీస్)
ఉత్తమ సాహిత్యం — ప్రశాంత్ పాండే (లాపతా లేడీస్)
ఉత్తమ కథ (ఒరిజినల్) — బిప్లబ్ గోస్వామి (లాపతా లేడీస్)
ఉత్తమ కథ (అనువాదం) — శ్రీరామ్ రాఘవన్ (మేరీ క్రిస్మస్)
స్పెషల్ ఎఫెక్ట్స్ (విజువల్స్) — రెడ్ చిల్లీస్ VFX (భూల్ భూలయ్యా 3)
బెస్ట్ ఎడిటింగ్ — జబీన్ మర్చంట్ (లాపతా లేడీస్)
ఉత్తమ కొరియోగ్రఫీ — బోస్కో-సీజర్ (బాడ్ న్యూజ్ : తౌబా తౌబా)
ఉత్తమ సినిమాటోగ్రఫీ — రఫీ మహమూద్ (కిల్)
ఉత్తమ డైలాగ్స్ — అర్జున్ ధావన్, ఆదిత్య ధర్, ఆదిత్య సుహాస్ జంభలే, మోనాల్ థాకర్ (ఆర్టికల్ 370)
ఉత్తమ స్క్రీన్‌ప్లే -స్నేహ దేశాయ్ (లాపతా లేడీస్)
ఉత్తమ సౌండ్ మిక్సింగ్ — సుబాష్ సాహూ, బోలోయ్ కుమార్ డోలోయ్, రాహుల్ కర్పే (కిల్)
ఉత్తమ సౌండ్ డిజైన్ — సుబాష్ సాహూ (కిల్)